


రావి కొండల రావు

# గయ్యాళి

పేరమ్మ భూమ్మీద పుడుతూనే గయ్యాళి తనంతో పుట్టింది. అది వంశపారం పర్యంవల్లా రాలేదు. తల్లిదండ్రుల వరాలవల్లా రాలేదు, కాని ఆ గయ్యాళి తనం చాలా దూరంపోయింది. పువ్వు పుట్టగానే వాసన తెలుస్తుందంటారు అట్లాగే పేరమ్మ పుట్టగానే గయ్యాళి వాసన వేసింది అదేమిటో! చిన్నప్పట్నుంచీ అల్లరిచెయ్యటం అమితమయి పోయింది. పాలు తాగకపోవటం—తాగితే అదంతా చుట్టూవున్న వాళ్ళమీద వుమ్మటం—కనబడ్డ సామాన్లన్నీ విసిరి వేయటం—ఇటువంటి పన్లే అన్నీనూ.

"ఇదెక్కడి గయ్యాళి అవతరించిందే ఈ ఇంట్లో?" అన్నది పేరమ్మ తల్లి.

"ఎవరికీ లేని పోలిక" అన్నాడు తండ్రి. నిజంగా గయ్యాళితనం రోజు రోజుకూ వయసుతోపాటు పెరుగుతూనే వుంది పేరమ్మకు.

ఇదో యేడొచ్చేసరికి పేరమ్మ పెంకి

తనం అంతా ఇంతాకాదు. చూసినవన్నీ కావాలనేది. ఇవ్వకపోతే నానా సంతా పెట్టేది. ఒకవేళ ఏదన్నా యిస్తే బాగా లేదనీ ఇంకొకటి కావాలనీ మళ్ళీ గోల! తోడిపిల్లలతో పోట్లాడేది. వాళ్ళు పేరమ్మ తల్లితో చెప్పేవారు. ఇంతలో పేరమ్మ వొచ్చి వాళ్ళే తనను కొట్టారంటూ బావురుమనేది! ఆ ఇంట్లో పేరమ్మ ఒక్కత్తే సంతానం కాబట్టి ఆమె ఏమాట అంటే ముద్దుచేత ఆ మాటే పాడిస్తూ వొచ్చారు.

ఒకనాటి మధ్యాన్నం మండుటెండలో ఒక ముసలాయన వాళ్ళింటికి వొచ్చాడు. ఆయనకూ వాళ్లకూ దూరంగా చుట్టరికం కూడా వుంది. పేరమ్మ పుట్టాక ఆ ఇంటికి రావటం అదే ప్రథమం ఆయనకు. ఆయన ఇంట్లోకొస్తూనే—"నువ్వే నుటే తల్లీ—మా విస్సన్న కూతురివి?" అన్నాడు చేతులు చాస్తూ.

"నువ్వని అంటావేం? మేం బ్రాహ్మలం" అన్నది పదేళ్ల పేరమ్మ.

"అబ్బోవ్—మహ మాటలునేర్చావే ఇప్పుడే?'' అన్నాడాయన నవ్వుతూ. ఈ మాటకు పేరమ్మ మండిపోయిమూలనున్న చీపురుకట్ట తీసి ముసలాయన మొహాన గిరవాటు పెట్టింది—"మళ్ళీ అదే కూతకూస్తావ్? ముసలిపీనుగా'' అన్నది. ఈగోలచూచి విస్సన్నగారు లోపట్నుంచి వొచ్చి ముసలాయన్ని ఊరుకోమని ప్రార్థించాడు. ''నన్ను ప్రార్థిస్తావేం? నీ కూతుర్ని మందలించు. లేకపోతే మళ్ళీ ఆపనే చేస్తుంది రేపు" అన్నాడు ముసలాయన మొహం ఒత్తుకుంటూ. పేరమ్మను ఇంట్లోకి పొమ్మన్నాడు తండ్రి. "ఇదెక్కడి గయ్యాళిదాన్ని కన్నావురా బాబూ, పెద్దయితే ఇది కొంపలు కూలుస్తుంది" అని దీవించాడు ముసలాయన.

చాలామంది పిల్లలు పెంకితనం చేస్తారు. ఐతే అది పెంకితనమే కాని గయ్యాళితనం కాదు. ఈ గయ్యాళితనం ఏ కొద్దిమంది పిల్లల్లోనో ఉంటుంది. మొండిపట్టు, పంతం — ఏడుపు — వుడుకుమోతుతనం — ఇంకా ఎన్నో అన్నిరకాలు కలిసి గయ్యాళితనంగా ఏర్పడ్డాయి. ఇన్నిగుణాలూ పేరమ్మలో ఉన్నాయి. బజార్లో వస్తువేదన్నా చూస్తే అది కొనేదాకా చంపుతుంది. కొన్న తర్వాత వెంటనే పారేస్తుంది —అదో లక్షణం! విస్సన్నగారు ఈ కూతురితో విసిగిపోతున్నాడు. గట్టిగా కోప్పడా లేడూ ఊరుకోనూలేడూ. ఆయన భార్య మరీనూ. ఆవిడ అసలు ఏమాటా అనదు. అంత ముద్దు!

"ఒక కూతురయితే మాత్రం అంత ముద్దు చేస్తారేం ?" అన్నాడు చికాగ్గా విస్సన్నగారు.

"చంటిపిల్ల. తెలియక యేదో అంటుంది" అన్నది ఆయన భార్య.

"నీ మొహం. నువ్వే దాన్ని మరింత గయ్యాళి చేస్తున్నావు."

రికి పెళ్ళిచెయ్యటంతో ఐపోతుంది. చాతనయితే మొగుడు దిద్దుకుంటాడు. వాజమ్మయితే అనుభవిస్తాడు!

విస్సన్నగారు కూతురికి పెళ్లిచెయ్యటానికి వరులకోసం అన్వేషణ ప్రారంభించాడు.

నెలరోజులు గడిదాక ఒకనాడు పేరమ్మను తల్లి అడిగింది—"ఏమే-పెళ్లి చేసుకుంటావుటే ?" అని. కాని వెంటనే భయపడ్డది 'ఎందుకిట్లా అడిగానా' అని. వెంటనే 'చేసుకోను' అనేసిందంటే ఇహ భస్తే చేసుకోదు. దాని పంతం అంత! కాని పెళ్ళియోగ్యత వున్న పేరమ్మ ఆ ప్రశ్న వినగానే కొద్దిగా సిగ్గుపడ్డది. ఈ మధ్య పేరమ్మకు సిగ్గుపడటం చాతనయింది! తల వంచుకుని చిన్నగా నవ్వింది.

"ఏమే" అని మళ్ళీ కదిలించింది తల్లి.

పేరమ్మ సమాధానం ఇవ్వలేదు. పమిట సర్దుకుంటూ లేచి గదిలోకి పోయింది. తల్లి 'చిట్టితల్లికి అప్పుడే అంత సిగ్గు' అనుకున్నది. పేరమ్మకు స్నేహితులూ ఉన్నారు — వాళ్ళతో కూడా పేచీలు పెడుతుంది. వాళ్ళింటి ప్రక్కనే జానకి అనే అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి చదువుతున్నది. పేరమ్మకంటె ఏ రెండుమూడు నెలలోపెద్ద. ఆ అమ్మాయి రోజుకు రెండుసార్లు ఒళ్ళు కడుక్కుంటుంది. మొహానికి స్నోలూ, పౌడర్లూ పూసి-తలకు వాసనవేసే నూనె రాసుకుని గంటన్నరసేపు దువ్వి వొదులుగా పెద్దజడ వేసుకుంటుంది. రోజూ ఒకో్కచీరె కట్టుకుని కాలికి జోడు వేసుకుని వీధిలోకి పోతుంది. ఇదంతా పేరమ్మకు ఎంతో ఎబ్బెట్టుగా కనుపించింది. ఆ అమ్మాయి కనబడినప్పుడల్లా చీదరించుకుంటుంది. 'ఎంత పొగరుమోతు' అనుకుంటుంది, ఆ జానకి ఒక నాటిరాత్రి సినిమాకి వెళ్ళింది తన స్నేహితురాల్తో. పదిగంటలవేళకు యిల్లు చేరుకున్నది. ఆవేళకు పేరమ్మ విస్తళ్ళు పారెయ్యటానికి వీధిలోకొచ్చి చూసి నించుండిపోయింది

"రేపొ్పద్దున్న వొస్తావుగా సీతా" అన్నది జానకి తన స్నేహితురాల్తో.

"ఆఁ"

"మరిచిపోకూ."

"లేదు."

"అన్నట్టు — ఆ సిల్కు జాకెట్టు తెస్తావుగా"

"ఆఁ ఆఁ."

"గుడ్ నైట్."

"గుడ్ నైట్."

కళ్లు అంతవి చేసుకుని పేరమ్మ ఈ సంభాషణ విన్నది. జానకి ఇంట్లోకి పోయినతర్వాత — "ఓసి దీనిదర్జా" అనుకుంది.

"అమ్మా—పక్కింటి జానకి లేదూ —తిరిగి తిరిగి ఈ రాత్రివేళొచ్చి—

అదెవత్తెతోనో ఇంగ్లీషు కూడానే" అని తల్లికి చెప్పింది.

"పోనీ, మనకెందుకే" అనేసింది తల్లి.

"అదేమిటే మరీ అంత? వేషం ఎట్లా వేసిందనుకున్నావ్? అమ్మో చూడాల్సిందేలే."

"వాళ్ళకేం? డబ్బున్నవాళ్లూ, చదువుకుంటున్నదీ—వేషాలకేం లోటూ?"

"చదువుకుంటే వేషం యెందుకూ? నేను చదువుకోలేదూ? ఐనా దాన్ని చూస్తే నాకు మంట'' అనేసి లోపలికి పోయింది.

పేరమ్మకు ఐదోఏట అక్షరాభ్యాసం చేసి రెండునెల్లు అక్షరాలు దిద్దించారు. ఏడో ఏటికి ఏదో కొంత దార్లోపడ్డది. అంటే ఒకటోక్లాసు పుస్తకం చదివేది. తర్వాత ఒక ప్రయివేటు మేస్టరుని పెట్టాడు విస్సన్నగారు. ఆయన రెండు రోజులు పాఠంచెప్పి — మూడోనాడు పేరమ్మ చేత పలకతో తల పగలగొట్టుకుని-ఆ ఇంటినీ ఆ అమ్మాయినీ శాపనార్థాలు పెడుతూ వెళ్ళిపోయాడు. అంతే! తర్వాత పేరమ్మకు చదువు మరి సాగలేదు! ఏదన్నా చదవాలంటే గంటకో అక్షరం చొప్పున కూడపలుక్కోగలదు!

కొన్నాళ్ళకు పేరమ్మకూ, హనుమాన్లుకూ పెళ్ళి జరిగింది. హనుమాన్లు ఇరవైతొమ్మిదేళ్ళవాడు మొదటి భార్య పోయి రెండేళ్ళయింది. వ్యవసాయం వృత్తిగా చేసుకుని జీవిస్తున్నాడు. వచ్చే ఆదాయం తన కుటుంబానికి పుష్కలంగా సరిపోతుంది. తల్లీ, తనూ, చెల్లెలూ, తమ్ముడూ-భార్యా. మనిషి చాలా అమాయకుడు. పేరమ్మ ఆడించటానికి తగినవాణ్ణిచూసి పెళ్ళిజరిపాడు విస్సన్నగారు. చూపులకు పేరమ్మ బాగానే కనుపించింది హనుమాన్లుకు. హనుమాన్లూ బాగానే వున్నాడనుకుంది పేరమ్మ. అటువంటి సంబంధం కలిసొచ్చింది మరి!

పేరమ్మ అత్తవారింట్లో కాలు పెట్టిన క్షణంనుంచీ ఆ ఇంటికి యజమానురాలయింది. ఇంట్లో అన్నిపన్లూ చేయించుకుందుకు నౌఖరున్నాడు—వంటకు అత్తగారున్నది — విస్తళ్ళు వెయ్యటానికీ, వడ్డనకీ ఎంగిళ్లు తియ్యటానికీ ఆడబొడుచున్నది ఇహ పేరమ్మకు ఆ ఇంట్లో ఏంపని? — అధికారం చలాయించటం తప్ప!

హనుమాన్లు కేవలం పల్లెటూరివాడు. ఆ గ్రామంలో చాలాకాలమై వుంటున్నాడు. నమ్మకంగా హాయిగా బ్రతుకుతున్నాడు. ఇంట్లో దేనికీ ఇబ్బంది పడక్కర్లేకుండా గడుపుకొస్తున్నాడు. ఏనాడూ ఆ యింట్లో గట్టిగా ఓ కేకగాని ఓ తిట్టుగాని వినిపించేవి కావు. కాని పేరమ్మ వొచ్చిన తర్వాత ఎప్పుడూ ఆ ఇంట్లో గాలివానే! అత్తగార్ని ఆడిపొయ్యటం—ఆడబొడుచును అదమా



యించటం—భర్తను చాతకాదనటం—రోజూ జరిగే భాగోతం! కోపంవస్తే కనిపించిన సామాన్లు విసిరేసి ఇల్లంతానానా భీభత్సము చేరిపారేస్తుంది. ఐతే ఆ కోడలు మాటకు ఏనాడూ ఓ ఎదురు మాటగాని ఓ జవాబుగాని చెప్పి ఎరగదు అత్తగారు. ఆవిడ కూతురూ అంతే! హనుమాన్లు అసలు సరేసరి. ఇహపోతే అతని తమ్ముడు పట్నంలో స్కూలు ఫయినలు చదువుకుంటున్నాడు. పెళ్ళికొచ్చి వెళ్ళిపోయాడు. ఆ ఇంట్లో అందరూ అంత మెత్తనివాళ్ళేమో, పేరమ్మ గయ్యాళితనం మరీ విజృంభించింది.

ఒకనాడు పొద్దున్న హనుమాన్లు పాలుతీస్తూవుంటే ఆవు తన్నేసి పాలన్నీ పోయినయ్. అప్పటికింకా పేరమ్మ లేవలేదు కాని లేస్తే ఏమయ్యేదో అని వాళ్ళు గుండెలు చేత్తో పట్టుకున్నారు. పాలకోసం పోయి హనుమాన్లు తిరిగొచ్చాడు — దొరకలేదు. ఇంతలో పేరమ్మ లేవటం, మొహం కడగటం జరిగిపోయినై. గదిలోకొచ్చి చూసింది. బల్లమీద కాఫీ లేదు! "లచ్చూ-కాఫీ ఏది?" అని అరిచింది పేరమ్మ. 'తెస్తున్నా' నంది ఆడబొడుచు. కాసేపటికి ఎట్లాగో పాలొచ్చాయి. కాఫీ కలిపి తీసుకెళ్ళింది వొదినగారికి.

"ఏం యింత ఆలస్యం?" అన్నది పేరమ్మ. లక్ష్మి మాట్లాడకుండా ఆ గిన్నె బల్లమీద పెట్టేసి వొణికిపోతో తున్నది. "ఇటు చూడు" అని అరిచింది పేరమ్మ. లక్ష్మి గుండెలు కొట్టు కుంటున్నై. ఒణికిపోతూ వొదినమొహం చూసింది.

"ఎందుకు ఇంత ఆలస్యం ఐందంటే పలకవేం?"

లక్ష్మి "ఏంలేదు" అన్నది నెమ్మ దిగా.

"ఏంలేకపోవటమేమిటి? వెధవ కాఫీ నాకొద్దు — చావు" అని ఆ గిన్నెతీసి లక్ష్మి మొహాన కొట్టింది. నుదుటిమీది చర్మం వూడి రక్తం కారింది — ఆ రక్తంతో ఆ కాఫీ కలిసిపోయింది. చీరె కొంగుతో మొహం ఒత్తుకుని—కిందపడి సొట్టపోయిన గిన్నె తీసుకుని ఏమీ అనకుండా నెమ్మదిగా వెళ్ళిపోయింది లక్ష్మి!

"అదేమిటే?" అన్నది ఆశ్చర్యంగా లక్ష్మి తల్లి.

లక్ష్మి మాట్లాడలేదు.

"ఒదినేనా!"

తల్లిమొహంలోకి ఒకసారి చూసి— పొంగిపోతున్న దుఃఖం ఆపుకోలేక తల్లి గుండెలమీద పడి బావురుమని ఏడ్చింది.

"అయ్యో...ఇదంతా ప్రారబ్ధం"అని ఆవిడ తల నిమురుతూ ఆ తలమీద తన కంటి నీళ్ళుకూడా కార్చింది.

ఆ కుటుంబమే అంత! హనుమాన్లు తండ్రి ఆ వూళ్ళో ఎంతో మంచివాడుగా పేరుపడ్డాడు. ఆయనంత 'ధర్మ ప్రభువు ఆ వూళ్ళో మరి పుట్టడనికూడా ఆ ఊరి వాళ్ళంటారు. ఆయనకు తగిన భార్య ఆవిడ ... ఆ సంతతి కూడా అట్లాటిదే.

హనుమాన్లుకూడా తన భార్య చర్య విని ఏమీ అనలేదు. అవాళ మధ్యాన్నం వొంటిగంటదాకా భోజనానికి లేవలేదు పేరమ్మ. అత్తగారొచ్చి నాలుగయిదు కసిరించుకుని వెళ్ళిపోయింది. పొలం నుంచి హనుమాన్లొచ్చి బ్రతిమాలాడు. పేరమ్మ అతి కష్టంమీద లేచింది. ఏదో తిడుతూనే ఇంత అన్నంమింగి పోయి పడుకున్నది!

ఒకనాడు హనుమాన్లువేపువాళ్ళు కొందరు బంధువులొచ్చారు. వాళ్ళు పట్నంలో వుంటున్నారు. ఒక మొగా యనా, భార్యా, పదిహేనేళ్ల కూతురూ ఇద్దరు పిల్లలూనూ. పేరమ్మ వాళ్ళొచ్చిన గంటదాకా బాగానే మాట్లాడింది. వాళ్ళ మ్మాయి స్నానంచేసి వచ్చాకే పేర మ్మకు ఆకుటుంబంమీద మంటపుట్టింది. గదిలోకూచుని తలుపు సందులోంచి చూస్తున్నదిపేరమ్మ. బయట వరండాలో కూచుని వాళ్ళమ్మాయి నున్నగా దువ్వి వేళ్ళతో ముందు వెంట్రుకలు రేపుకుని నుదుటిమీదకు జార్చింది. మొహానికి స్నో పౌడరు పూసుకున్నది. పల్చని చీరె

కట్టుకుంది. కాటుకా బొట్టూ లేదు. ముస్తాబవుతున్నంతసేపూ ఏదో కూని రాగం తీస్తూనేవుంది. ఇదంతా—గమనించి...పేరమ్మ ఛివాలున వొచ్చి...

"ఇదిగో అమ్మాయ్! మీ పట్నంలో ఐతే వేషాలు వేశావ్‌గాని — ఇక్కడ పనికిరాదు" అన్నది గట్టిగా. ఆ అమ్మాయి నిశ్చేష్టితురాలైపోయి, ఈమె సాహసానికి ఆశ్చర్యపోయింది. ఆ అమ్మాయి తల్లి వొచ్చి ఏమిటన్నది.

"ఇదిగో ఆ షోకులూ గీకులూ ఈ ఇంట్లో పనికిరావు. ఇది సంసారుల ఇల్లు...వుంటే చచ్చినట్టు వుండండి- లేకపోతే పొండి."

ఈ అగౌరవవచనాలు ఆవిడ విని ఏదో అనబోయిందిగాని హనుమాన్లు తల్లి వొచ్చి వారించి ఆవిడని లోపలికితీసుకు పోయింది.

మధ్యాన్నం పేరమ్మ భోంచేసి గది లోకి పోయేసరికి ఆ ఇద్దరుపిల్లలూ ఆమె మంచంమీద యెక్కి అక్కడవున్న ఏవో సామాన్లు తీస్తున్నారు. పేరమ్మ నుడిగాలిమల్లే రెచ్చిపోయి రెండు చేతుల తోనూ ఆ పిల్లలను ఈడ్చేసి నాలుగు మొత్తి తిట్టి గదిఅవతలకు తోసేసింది. ఏనాడూ దెబ్బలంటేనే ఎరగని ఆ పసి పిల్లలు ఎంతసేపు ఏడ్చారో అంతులేదు!

"అదేంపిచ్చా! చంటిపిల్లల్ని పట్టుకుని ఎట్లా బాదింది!" అన్నది పిల్లల్ని వూరుకోమనిచెప్తూ ఆ తల్లి.

"చంటిపిల్లలయితేనేం ... పెద్దవాళ్ళే ఐతేనేం. వెధవపనులు చేస్తే పాతేస్తాను. అదే నా పిల్లలేఐతే ఆమాంతం చంపేసి వుందును" అన్నది అరుస్తూ పేరమ్మ.

"అంతదానివేలే తల్లీ నువ్వు."

'నీ మొహం యీడ్చా' అనుకున్నారు వాళ్ళు. ఆ సాయంత్రమే వాళ్ళవూరెళ్ళి పోయారుకూడా!

సెలవలకు హనుమాన్లు తమ్ముడు జగన్నాథం వాళ్ళ గ్రామం వొచ్చాడు. ఇంట్లోకి ఒస్తూవుంటే పేరమ్మచూసి ... "ఒహో మరిదీ- గుర్తున్నానా?" అన్నది నవ్వుతూ.

"ఏం వొదినా కులాసాగావున్నావా?" అన్నాడు

"ఆఁఆఁ" అని కాళ్ళు కడుక్కోమని నీళ్ళుతెచ్చింది!

"దీని ప్రవర్తనఅంతా మరీవిచిత్రం" అన్నది లక్ష్మిచెవిలో ఆమె తల్లి.

'ఒదిన చాలా మంచిదే' అనుకున్నాడు జగన్నాథం.

అంతే! ఆ సాయంత్రమే జగన్నాథానికీ పేరమ్మకూ పెద్దపోట్లాట! తిట్లూ! ఎందుకొచ్చిందో తెలీదుకాని పోట్లాట, పేరమ్మ తిట్లతో ప్రారంభమయింది. జగన్నాథం ఎదురు సమాధానంగా నాలుగయిదు తిట్లు విసిరాడు. తల్లీ హనుమాన్లూ చెప్పినా వినకుండావొచ్చిన నాటి రాత్రే జగన్నాథం పట్నానికి పోయాడు!

కొన్నాళ్ళకు పేరమ్మ గర్భం ధరించింది. ఇహ కాలు కదిపితే వొట్టు! మహారాణికిమల్లే వైభవంగా వెలిగిపోతున్నది ఆమెకు!

ఒకనాటిరాత్రి, హనుమాన్లూ పేరమ్మా వాకిట్లో కూచున్నారు ఏదో మాట్లాడుకుంటూ. ఏదో మాటొచ్చి హనుమాన్లు ... "ఏదో చెప్పుకుందుకు మగపిల్లాడు పుడితే ఇహ నా జన్మ తరించిపోయినట్టే!" అన్నాడు.

పేరమ్మ దిగ్గుమని లేచింది. "ఛీ ఛీ మగపిల్లాడేమిటి ఖర్మం? ఆడపిల్ల కావాలని కోరండి–నాకదే ఇష్టం" అన్నది.

"ఆడపిల్లా మంచిదే అనుకో కాని ప్రథమసంతానం పిల్లాడయితే ఎంతో మంచిది" అన్నాడు నెమ్మదిగా.

"ఒద్దు–నాకు ఆడపిల్లే కావాలి. మగపిల్లాడిమీద మోజులేదు."

"పోనీలే–ఏమయితే అదే అవుతుంది. ఎవరోవొకరు పుట్టి బాగుంటే అదే చాలు" అన్నాడు హనుమాన్లు.

"ఎవరోవొకరేమిటి? నాకు మగపిల్లాడొద్దు. ఇదే చెప్తున్నాను—మగపిల్లాడు పుడితే వాడి గొంతుపిసికి చంపుతాను" అనేసి ఛర్రున వెళ్ళిపోయింది! ఈ ఘోరమయిన వాక్యంవిని హనుమాన్లూ తల్లీ, లక్ష్మి విస్తుపోయారు! ఇది అన్నమాట నెరవేర్చితీర్తుంది!

తొమ్మిది నెలలూ నిండినాక ఓ సాయంత్రం క్షేమంగా పురుడొచ్చింది పేరమ్మకు...మొగపిల్లాడు! ఈ వార్త వినగానే హనుమాన్లుకు కాళ్ళు స్వాధీనంలోంచి తప్పిపోయినై. తల్లీ, లక్ష్మి తల్లడిల్లిపోతున్నారు. పురిటిగదిలోంచి 'కంయ్' మని పిల్లాడిగొంతు వినిపించింది. హనుమాన్లు 'షాక్' తిన్నవాడల్లే అయి, వూపిరి బిగపట్టి తన కొడుకును ఒకసారి చూద్దామని నెమ్మదిగా గదిలోకి వెళ్ళాడు.

పేరమ్మ మంచంమీద కూచుని రెండు చేతుల్లోనూ పిల్లాణ్ణి వుంచుకుని చూస్తున్నది. అత్తగారులేదు. హనుమాన్లు రాగానే పిల్లాణ్ణి చూపిస్తూ "ఇదిగో చూడండి...పాపాయి ... మీ పోలికా? నా పోలికా?" అన్నది నవ్వుతూ. హనుమాన్లుకు నోటమాట రాలేదు. చూస్తూ వుండిపోయాడు.

"చూడ్రా...మీ నాన్నా...మాట్లాడరేమండీ?" అని పిల్లాణ్ణి చూపిస్తూ "చూశారా! కళ్ళు నావి. నోరూ నుదురూ మీవి. ఎంతయినా మీపోలిక బాగానే వొచ్చిందే."

హనుమాన్లు వొంటిమీద స్మారకం లేనివాడల్లే చూస్తున్నాడు.

"ఎత్తుకుంటారా?" అన్నది. ఏదోగా చేతులు చాచాడు.

"అమ్మ...ఎంతాశండీ! నా పాపని యివ్వనేయివ్వను ... అన్నట్టు 'పుత్ర సంతానం' అని మావాళ్ళకు శుభలేఖరాసి రమ్మనండి" అంటూ ఎంతో ప్రేమతో హృదయానికి అదుముకుని కొడుకుమీద ముద్దులు కురిపించింది పేరమ్మ!!